# బుల్లితెర

-ఉపద్రష్ట సాయి


కొత్త టి.వి. ఇంటికి వచ్చిన రోజు మా ఆవిడ మొహం ట్యూబులైటులా ప్రకాశవంతంగా వెలిగిపోయింది. పిల్లల సంతోషానికి అవధుల్లేవు. మా కాలనీలో చాలా మంది మా ఇంటికి వచ్చి కొత్త టి.వి.ని చూసి రకరకాల అభిప్రాయాలు వెలిబుచ్చారు.

కొందరు 'ఈ టి.వి.ని ఎందుకు కొన్నారు' అన్నారు. మరి కొందరు ఇదీ మంచి టి.వి.యే అని హామీ ఇచ్చారు. భిన్నాభిప్రాయాల మధ్య మా టి.వి. పనిచేయడం ప్రారంభించింది. ఉన్న అతి చిన్న గదులలో ఒకటి వంట గది. రెండోది హాల్ కమ్ డైనింగ్ కమ్ బెడ్ రూం. ఆ గదిలో టి.వి.ని ఒక మూల పెట్టగా అందరూ కాళ్ళు ముడుచుకుని పడుకోవలసిందే. అయినా ఫరవాలేదన్నారు మా వాళ్ళు. వాళ్ళకు కావలసిందల్లా టి.వి.లో బొమ్మ. ఆ సరదా కోసం ఎన్నిరకాలైన సర్దుబాట్లైనా చేసుకోడానికి సిద్ధపడ్డారు వాళ్ళు.

ఒకరకంగా టి.వి. కొన్న తృప్తి నాకు మిగిలినా నా తాహతుకు మించిన పని చేశానేమోననిపించింది నాకు. ఆర్థికంగా అనేక రకాలైన పత్తిళ్ళకు లోనైన నాకు టి.వి. కొనడం మరో కొత్త సమస్యనే తెచ్చిపెట్టింది. ఒక కంపెనీలో గుమాస్తాగిరీ చేస్తూ నెలకు ఎనిమిది వందల రూపాయిల జీతం తీసుకుంటున్న నేను ఇంటికి అద్దె కడుతూ, ఇద్దరు పిల్లలతో కాపురం చేస్తూ రూపాయి కూడా మిగుల్చుకో లేకపోయాను.

కాని నాలాగే మా వాళ్ళు అన్ని విషయాలలోనూ రాజీ పడుతూ బ్రతకలేక పోయారు. వాళ్ళు వాళ్ళ చుట్టూ వున్న వారి జీవితాలతో వారి జీవితాలను పోల్చి చూసుకుంటూ తమకు లేని వాటిని పొందాలనే తాపత్రయంలో వున్నారే కానీ తమ తాహతుకు అవి కావాలా అని ఆలోచించే పరిస్థితిలో లేరు. నేనైతే జీవితంలో కష్టాలను అనుభవించి, ఎదురు దెబ్బలు తిని సుఖ దుఃఖాలకు అతీతుడునై బ్రతుకుతున్నాను. కానీ, వాళ్ళలా కాదు. నా భార్య మాత్రం టి.వి. కొనమని బలవంతం చెయ్యలేదు. నిష్టూరాలకు పోలేదు. కానీ ఆమె మనసులో మాత్రం ఇంట్లో ఒక టి.వి. వుంటే కాలక్షేపం చెయ్యడానికి వీలవుతుంది అనుకునేది. పిల్లలు అలా కాదు, ఒకసారైతే సురేష్ అడగనే అడిగాడు. "నువు కూడా పెద్ద ఉద్యోగం చేస్తే మనింట్లో టి.వి. వుంటుంది. నువ్వెందుకు ఎక్కువ డబ్బు సంపాదించడం లేదు" అని. "పాపం, వాడికి జీవితం అంటే తెలియని వయసు. ఉద్యోగాలూ, చదువులూ, జీతాలూ, పరిస్థితులూ మన చేతిలో వుంటాయనుకోవడం పొరబాటనే విషయం వాడికి తెలియడానికి ఇంకా చాలా సంవత్సరాలు పడుతుంది" అనుకున్నాను.

వచ్చిన వాళ్ళు టి.వి.ని చూసి బాగుందని చెప్పి వెళ్ళిపోయారు. కొత్త టి.వి. కనుక ప్రోగ్రాంలు ప్రారంభమైన దగ్గర్నుంచీ 'మళ్ళీ రేపు కలుద్దాం' అనే దాకా టి.వి. పని చేసేది. పిల్లలు చదువులు మూట కట్టేశారు. కొత్త కదా అని వూరుకున్నాను. మా ఆవిడ కూడా సాయంత్రం అయ్యేసరికి అన్ని పనులు చకచకా పూర్తిచేసుకుని ఆ పెట్టెముందు కూర్చునేది. అప్పుడు ఎవరైనా తెలిసిన వాళ్ళో, చుట్టాలో వస్తే ఒక విధమైన అసంతృప్తి కలిగేది ఆమెకు. అంతకితం, ఎవరైనా వస్తే కాలక్షేపం అవుతుందనుకునే ఆవిడే ఇప్పుడు ఎవరొచ్చినా విసుక్కునేది. వాళ్ళే కాదు, ఆఫీసు నుంచి తిరిగొచ్చిన నాకే గుక్కెడు కాఫీ ఇవ్వాలంటే ఆమెకు బద్ధకంగా వుండేది. భర్తను పరామర్శించే ఓపిక పోయింది. మొదట్లో ఆమె ప్రవర్తనకు నా



మనసు బాధపడినా తరువాత తరువాత నేనే ఆమెతో రాజీపడ్డాను. అది ఆమె తప్పుకాదు. ఊరంతా టి.వి.లు కొనుక్కొని సంవత్సరాల తరబడి సరదాగా చూస్తుంటే తను మాత్రం రకరకాల తర్జన భర్జనల తర్వాత టి.వి. కొన్నాడు. అంతకాలం అణగి ద్రొక్కుకున్న ఆమె ఆశ ఒక్కసారే తీరడంతో మనసు కొంచెం వశం తప్పింది. అంతే. కొన్నాళ్ళు పోతే టి.వి. సరదా తీరిపోతుంది. మళ్ళీ మామూలు మనిషవుతుంది'' అనుకున్నాను.



V.ARUNA.

నాకు మాత్రం ఆ పెట్టెను చూసినప్పుడల్లా కట్టాల్సిన వాయిదాలే గుర్తుకు వచ్చేది. అప్పు తీరేదాకా అది మా సొంతం కాదు. అంతేకాదు మొదట్నుంచి కూడా నాకు టి.వి. సరదా లేదు. జీవితంలో చిన్నప్పటి నుంచీ రకరకాల సమస్యలనే చవిచూసిన నాకు టి.వి. చూడడం వల్ల పెద్దగా ఆనందం కలగడం అసంభవం అనిపించింది. దాని మీద మనసు లగ్నం కూడా కాలేదు.

ఇంటి బయట పడక్కుర్చీలో కూర్చుని పాత పుస్తకం చదవడమో లేకపోతే కళ్ళు మూసుకుని గతాన్ని గుర్తుకు తెచ్చుకోవడమో నాకు తృప్తిని కలిగించేది.

నిజానికి ఈ నాడు నేనింత మాత్రమైనా బతుకుతున్నానంటే అందుకు కారకులైన వారిని స్మరించుకోవడంలో నాకు తృప్తి కలుగుతుంది.

ఆరు సంవత్సరాల వయస్సులో నాన్న పోయినప్పుడు ఆదుకునే వాళ్ళు లేని నా కుటుంబం కష్టాల పాలైంది. నా కన్నా రెండు సంవత్సరాల పెద్దదైన అక్క, రెండు సంవత్సరాలు చిన్నదైన చెల్లెలు నాకు మిగిలారు. ఇంటికి మగవాణ్ణి నేనే. అమ్మ చదువుకోని ఆడది. నాన్న కొంచెం అప్పు కూడా మిగిల్చి పోయారు. అప్పుల వాళ్ళకు జవాబు చెప్పలేక అమ్మ బాధపడడం ఆ రోజుల్లో నేను చూసి అర్థం కాక నిలబడే వాడిని. తండ్రి పోవడంతో మా బడి చదువులు ఆగిపోయాయి. అమ్మ ఒక ఇంట్లో వంట పని చేసేది. ఒకప్పుడు బాగా బతికి చితికిపోయిన ఇంట్లో కూతురుగా పెరిగి, భర్త పోవడంతో మరింత చితికి పోయిన మా అమ్మ జీవితంతో రాజీపడి మా భవిష్యత్తే పరమావధిగా వంట పని చెయ్యడానికి కూడా బాధపడలేదు. కానీ ఆ చిన్న వయస్సులో కూడా నాకు అమ్మను చూస్తే జాలి వేసేది. తను పస్తున్నా మాకు తృప్తిగా ఎంతో కొంత అన్నం పెడుతూ మా కనీస అవసరాలను తీరుస్తూ తన ఆరోగ్యాన్ని కూడా ఖాతరు చేయకుండా మమ్మల్ని పెంచింది.

ఈ మధ్యకాలంలో నా అదృష్టం బాగుండి వారాలు చేసుకోవడానికి అవకాశం కలగడంతో వారాలు చేసుకుంటూ ఒక మంచి మనిషి సహకారంతో చదువు ప్రారంభించాను. నా భవిష్యత్ చదువు మీదే ఆధారపడుందని తెలిసింది. కిరసనాయిలు దీపం వెలుతుర్లో చదువుకున్నాను. మురికి బట్టలు తొడుక్కొని బడికి వెళ్ళి అందరిచేతా అవహేళన చెయ్యబడ్డాను. పుస్తకాలు కొనుక్కోలేక క్యాలెండర్ల వెనుక రాసుకుని చదువుకునే వాడిని. ఆ రోజుల్లో ఇప్పటిలా బడి పిల్లలకు సవాలక్ష కండిషన్లు పెట్టే వాళ్ళు కారు. వాళ్ళు చదువు గురించే ఆలోచించేవాళ్ళు. అంతేకాని యూనిఫారమ్స్, బూట్లు, సంచీలు, పుస్తకాల అట్టల గురించి కాదు, అంతస్తుల మధ్య తేడాలు అప్పుడూ వుండేవి. బీదవాడిని నన్ను చాలా మంది చిన్న చూపు చూసేవాళ్ళు. కానీ నేను వాళ్ళను పట్టించుకోలేదు. కారణం నా ధ్యేయం వేరు.

ఎలాగైనా ఎస్సెల్సీ పాసవ్వాలి. ఎక్కడైనా చిన్న గుమాస్తా గిరీ సంపాదించుకుని అమ్మను సుఖపెట్టాలి. అక్కా చెల్లెళ్ళను ఆదుకోవాలి. అంతే.


జీవితం ఉద్యమం అయింది.

సంవత్సరాలు దొర్లిపోయాయి.

కష్టాలు... కష్టాలు... కష్టాలు,

ఒక పుణ్యాత్ముడి చలవ వల్ల కంపెనీలో గుమస్తా గిరీ దొరికింది. నేను నాలుగు రాళ్ళు సంపాదించడం మొదలు పెట్టే సరికి అమ్మ ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నది. అనారోగ్యంతో మంచ మెక్కిన ఆమెకు గొప్పగా వైద్య సదుపాయాలు కలిగించ లేకపోయాను. మా కోసం అలిసి పోయిన ఆమెకు కాసింత విశ్రాంతి మాత్రం కలిగించ గలిగింది నా జీతం. అంతే... కానీ ఒకప్పుడు కుటుంబ భారాన్ని మోసిన ఆమె విశ్రాంతి దొరికినా మనశ్శాంతిగా బతక లేకపోయింది. కూతుళ్ళకు పెళ్ళిచేయలేకపోయాననే బాధ మిగిలిపోయిందామెకు. తండ్రి తర్వాత బాధ్యత గల కొడుకుగా నేను కూడా వాళ్ళకు పెళ్ళి చేసే పరిస్థితిలో లేను. పైగా వాళ్ళు అంతంత మాత్రమే చదువుకో గలిగారు. ఉద్యోగాలకు వెళ్ళే అర్హతలు లేకపోయాయి. ఇంట్లో పని లేకుండా కూర్చోలేక సతమతమయ్యేవాళ్ళు వాళ్ళు.

కాలగమనంలో ఒక రోజు పేపర్లో మానసిక వికలాంగుల సంక్షేమ నిలయంలో వికలాంగులను సంరక్షించడానికి స్త్రీలను వాలంటీర్లుగా ట్రెయిన్ చేస్తామనీ, ఇష్టం వున్న వాళ్ళకు



అక్కడ పిల్లలతో బాటు వుండడానికి బస కూడా ఏర్పాటు చేస్తామని ఒక ప్రకటన రావడం, వెంటనే మా అక్క చెల్లెళ్ళు ఆ కేంద్రానికి వెళ్ళడం జరిగింది. అక్కడి వాతావరణానికి స్పందించిన వాళ్ళు ట్రెయినింగ్ పొందడానికి అంగీకరించారు. మరో మూడు నెలలలో మా అక్క చెల్లెళ్ళు ఇద్దరూ వికలాంగుల సంక్షేమ నిలయం లోనే వాలంటీర్లుగా చేరిపోయారు. వారి జీవితాలు ఒక దారికి వచ్చాయి. అమ్మ మాత్రం నా తోనే వుండేది.

ఆ దశలో శారదతో నాకు పరిచయం ఏర్పడడం, ఆ పరిచయం స్నేహంగా స్నేహం ప్రేమగా, పెళ్ళిగా మారి మేము దంపతు లయ్యాము. కోడలు రావడంతో అమ్మను చూసు కోడానికి ఒక మనిషి దొరికింది. మోడు వారిన నా జీవితం శారద వల్ల కొంత చిగురించింది. తల్లిని జాగ్రత్తగా పరామర్శిస్తూ బ్రతుకు వెళ్ళ బుచ్చుతూ గడిపాను. నాకిద్దరు పిల్లలు పుట్టేదాకా నాతో వున్న అమ్మ, రెండో సంతానం పుట్టిన రెండు నెలలకు కన్నుమూసింది. తల్లి గురించి జ్ఞాపకాలు ఎప్పుడూ నన్ను వెంటాడేవి. మళ్ళీ జీవితం బరువుగా సాగడం ప్రారంభించింది. ఒక వైపు కుటుంబాన్ని గడపడానికి చాలని ఆదాయం వల్ల ఇబ్బందులు, మరో వైపు అక్క చెల్లెళ్ళకు పెళ్ళి చెయ్యలేక పోయాననే బాధ మరో వైపు నన్ను పట్టి కుదిపేది. పుట్టిన పాపానికి బ్రతకడం, ఒక దశలో జరిగింది. బ్రతికిన పాపానికి పెళ్ళి, పెళ్ళైనందుకు బిడ్డలు, బిడ్డల కోసం మళ్ళీ బ్రతకడం, ఒక చక్రంలా తిరుగుతూ మనిషనే నేను ఆ చక్రంలో ఇరుసుగా మిగిలి పోయాను.

బరువును లాగే చక్రానికి ఇరుసే ఆధారం
అది విరిగిపోతే బండి మూలపడి పోతుంది.

అలా నా బండిమూల పడకూడదనుకుంటూ బ్రతకాలని తాపత్రయ పడే వాడిని నేను.


ఫోటో: ఎస్.బి. పార్వతి, వెల్లటూరు

కారణం చిన్న వయసులో తండ్రిని పోగొట్టుకున్న వాడిని నేను.

గత కాలపు చేదు అనుభవాలు, వారా లబ్బాయిగా పడిన అవమానాలు, పేద ఉద్యోగిగా సగటు మనుషుల మధ్య అనుభవించిన వేళా కోళాలు, ఎన్నోసార్లు నన్ను కృంగదీసినా, అందరి జీవితాలు వడ్డించిన విస్తర్లు కావనుకునే వాడిని కావడం మూలానా అన్నింటినీ తుడిచి పెట్టి మానసికంగా ఆవేదన మాత్రం అనుభవిస్తూ జీవితాన్ని గడిపేవాడిని. టి.వి. కొనాలనే ఆశ నాకేనాడూ లేదు.

నకిలీ జీవితాలను మనముందుంచే ఆ బుల్లి తెర మీద నిజమైన జీవితాలు ఎప్పుడో గాని కనిపించవు. ఆ తెర మీద అన్నీ రంగులు పులుము కున్న బొమ్మలే. కృత్రిమంగా కనిపించే వ్యవస్థ, మనుషులు నాకు మానసికానందాన్ని కలిగించ లేవు.

కానీ, నాలాగే నా వాళ్ళు ఉండాలనుకోవడం తప్ప. నా అభిప్రాయాన్నీ ఒక సారి నా భార్యతో చెప్పినప్పుడు ఆవిడ అన్న మాటలివి. ''బుల్లి తెర మీద బొమ్మలు రంగులు పులుముకున్న మాట నిజమే. కానీ, మనం కూడా మన మనసులకు రంగులు పూసుకునే కదా బ్రతుకుతున్నాము. నటనే కదా మన జీవితాన్ని నడిపిస్తూంది. ఈ వ్యవస్థలో ప్రతి మనిషి ఎంతో కొంత నటించ కుండా బ్రతకలేడు. అలాగే బుల్లి తెరలో కూడా మనిషి నటిస్తున్నాడు. కనుక మొహానికి రంగులు వేసుకోవడం, మనసు రంగు మార్చుకుంటూ బ్రతకడం రెండూ ఒక్కటే... నిజానికి ఈ వ్యవస్థ కూడా ఒక బుల్లితెరే''.

ఆవిడ మాటలు జాగ్రత్తగా ఆలోచిస్తే అర్థ వంతమైనవే అనిపించాయి.

అయినా బుల్లితెర మీద నాకు మమకారం పెరగ లేదు.

వాయిదాలు కడుతూ, వాకిట్లో పడకుర్చీలో కూర్చుని రెండు కళ్ళూ మూసుకుని, చిన్నప్పటి నుంచీ ఇప్పటి దాకా జరిగిన సంఘటనలను కళ్ళ ముందు సినిమాలా చూస్తూ ఆ చేదు అను భవాలను కూడా చూసి ఆనందించేవాడిని.

బాధే సౌఖ్యమనే భావన వచ్చిన మనిషై బ్రతకడం మొదలుపెట్టిన నాకు గతించిన జీవితం ముగింపులేని సినిమాలా అనిపించేది.

అలవాటు ప్రకారం పడక్కుర్చీలో కళ్ళు మూసుకుని కూర్చున్న నన్ను ఒక రోజు మా రెండో వాడు గట్టిగా పట్టి కదుపుతూ ''నాన్నా... రా... రా... టి.విలో సిన్మామాడు'' అని పిలి చాడు. అలా వాడు ఎన్నోసార్లు పిలిచే వాడు. కానీ నేనెప్పుడూ వాడి మాటకు విలువనిచ్చి బుల్లి తెర దగ్గరికి వెళ్ళే వాడిని కాను.

కానీ... పాపం! వాడి మాటను ఎందుకు తోసిపుచ్చాలి. కనీసం ఒక్కసారైనా వాడికి ఆనందం కలిగించే పని ఎందుకు చెయ్య కూడదనుకుంటూ కుర్చీలోంచి లేచి బుల్లి తెర దగ్గరికి వెళ్ళి కూర్చోబోయాను.

అంతే! కరెంటు పోయింది.

మా వాడి మొహం ఫ్యూజు పోయిన బల్బులా పాలి పోయింది.

కానీ నాకు మాత్రం ఓటమి అలవాటై పోయింది.

మళ్ళీ పడక్కుర్చీలో వాలిపోయి నా మ నసు బుల్లితెర మీద అనుభవాల సిన్మాను పరు గెట్టించడం మొదలు పెట్టాను.

ఈ బుల్లితెర మీద కరెంటు పోయినా సిన్మా కనిపిస్తుంది జీవితాంతం.

